

నాటి సంప్రదాయాలు నేటి కథలు

అపర్ణ మునుకుట్ల గునుపూడి

# కాలభైరవ కథనం

"అమ్మా! అమ్మా! look what we have" అంటూ పిల్లలు ఇంట్లోకి వచ్చేరు.
"ఏమిటి" అని చూడగా చిన్న అట్ట పెట్టి తీసుకుని మావారు ఇంట్లోకి అడుగు పెట్టేరు. "అదేమిటి! " అన్నాను ఆశ్చర్యంతో.

"వీధి చివర ఉంటున్న వాళ్ళు కుక్క పిల్లలు ఉచితంగా అన్నారుకదా. అదేమిటో చూద్దామని వెళ్ళేం. వాళ్ళవి ఉత్తమ జాతి కుక్క పిల్లలు. కొట్లో కొనాలంటే బోలెడు ఖరీదు అవుతుంది. పిల్లలు కూడా సరదా పడుతున్నారు జాప్నవి. అందుకని ఓ పిల్లని పట్టుకు చక్కా వచ్చేం" అని యధాలాపంగా అంటూ వస్తున్న ఆయన్ని నమిలి మింగేయాలన్నంత కోపంతో ఉన్నా, సరే పెట్టిలో ఏముందా అని చూద్దునుగదా! చెప్పొద్దూ, బుంగమూతితో, నిగనిగలాడే కళ్ళేసుకుని, వళ్ళంతా బంగారు వన్నె పూసుకుని, వేళ్ళాడి పోతున్న చెవులేసుకుని, అమితమైన కళతో ఉండి, నిల్చోడానికి కూడా శక్తిలేకుండా పడుతూ లేస్తూ అయోమయంగా తిరుగుతున్న ఆ బుజ్జి కుక్కపిల్లని చుస్తే అమాంతం ముద్దేసింది. "అయినా మరీ ఇంత పసికూనకదా, తల్లినుంచి వేరు చేస్తే బాధపడుతుందేమోన్రా. కొన్ని రోజులాగి తెస్తే........ " అంటూ నసిగేను, కొన్ని రోజులకి వీళ్ళు ఆ విషయం మర్చిపోతారేమోనన్న ఆశతో.

"No Mommy, all the pretty ones would be gone by then, we will take care of everything for him, please could we keep him, please, please, please pretty please with sugar and a cherry on top" అంటూ ఇద్దరూ రెండు చేతులూ పట్టుకుని బతిమాలుతున్నారు.

"ఏం చెయ్యాలి" అన్నట్టు మావారి వైపు చూసేప్పటికి, ఆ పెట్టి నా చేతిలో పెట్టేరు. దాన్ని పెంచడంలో ఉన్న బరువు బాధ్యతలు తెలియని పిల్లల్ని వెనకేసుకొస్తూ ఆయన కూడ ఇలా చేస్తే నేను మాత్రం చేసేదేముంది. తప్పేది లేక అందుకున్నాను. వెంటనే ఆ బుజ్జిముండ నా వేళ్ళని నాకడం మొదలుపెట్టింది.

"ఛ ఛా అదేమిటీ అసహ్యంగానూ' అంటూ కింద పెట్టేసేను.

దానికి ఆకలిగా ఉందేమోనంటూ పిల్లలు కాసిని పాలు తెచ్చి దాని ముందు పెట్టేరు. నిజంగా ఆకలేసినట్టుగా అది ఆ పాలన్నీ గుటుకు గుటుకుమంటూ తాగేసింది. ఆ కాస్తకే అలిసిపోయినట్టు మరో రెండు నిముషాల్లో గుర్రు పెట్టేసింది. ప్రశాంతంగా నిద్రపోతున్న దాన్ని చూస్తే మహా ముచ్చటేసింది సుమా. కాని ఈ ఉచ్చులో పడకూడదనుకుంటూ తల విదిలించుకుని పనులు చేసుకోడానికి లేచేను. మావారు వాడ్ని register చేయాలి అంటూ ఫోన్ చేస్తే వాడికి పేరు పెడితేగాని రిజిస్టరు చెయ్యరుట అన్నారు. ఇహనేం, మావాళ్ళిద్దరూ గంతులేస్తూ నేనంటే నేనని వాళ్ళకి నచ్చిన పేర్లు చెప్తూ వచ్చేరు. ఒకళ్ళు చెప్పినది ఇంకోహాళ్ళకి నచ్చలేదు కనక ఇద్దరూ చెప్పినవి పెట్టాల్సి వచ్చింది. పెద్దమ్మాయి Rico అని పెట్టాలంది. చిన్నదేమో టింకు అంది. "సరే, ఏదో ఒకటి పెడదాం లెండ్రా." అంటూ వాడిన్నాపాల పడేసి SPCA కి బయలుదేరేరు.

కాసేపటికి తిరిగొచ్చి "ఇదిగో వాడి registration certificate" అన్నారు. దాన్ని చూస్తే నా మతి పోయింది. నాకేనేమిటి! అది చూస్తే ఎవరికైనా మతి పోతుంది. అక్కడ మా ఇంటి పేరుతో సహా "కాశి రీకో టింకు వర్ధన్ నులకవీడు" అని ఉంది.

"ఇదేఁవిటీ!"

"అవునూ, అక్కడ వాళ్ళేమో ఇంటిపేరు కూడా పెట్టాలన్నారు. సరే, అంతవరకూ వచ్చాక మన ఇంట్లో అందరికీ పేరుకి ముందు కాశి చివర వర్ధన్ చేర్చే ఆనవాయితీ ఉందికదా అని అవి కూడా చేర్చేసేను." చేసిన ఘనకార్యం గొప్పగా చాటుకుంటూ వాడి నామకరణ మహోత్సవ ఉదంతం చెప్పేరు శ్రీవారు.

"మరిహనేం ఇంకా వీర, వెంకట, వరాహ, అనంత, రాము, కూడా చేర్చకపోయారూ" వీడి పనంతా చివరికి నా మీదకొచ్చిపడుతుందన్న ఉక్రోషంతో అన్నాను. కాని చటుక్కున ఓ రెండేళ్ళ క్రితం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. మేమంతా ఓమాటు India వెళ్ళినప్పుడు ఓ కోయవాడు చెయ్యి చూస్తానంటూ వచ్చేడు. పిల్లలు అదేమిటని గొడవ చేయగా, ఇంట్లో వాళ్ళందరి బలవంతం మీదా, సరేనని నా చెయ్యి చూడమన్నాను.
"అంబ పలుకు జగదంబ పలుకు" అంటూ వాడొక పెద్ద చదువు చదివి,
"అహ సుపుత్రుడు అగపడే చిన్నమ్మా! తొందరలో నీకు పుత్రోత్సాహం కలుగుద్ది చిన్నమ్మా" అంటూ ఇంకేవేవో చెబుతున్నాడు.
వాడన్న ముక్కలు అర్థం అవక వాడికేసే చూస్తున్న నన్ను చూసి

"అక్కా నీకు కొడుకు పుడతాడంటున్నాడే' అంది చెల్లి.

"వాడి పిచ్చి వాగుడు కాకపోతే ఈ వయస్సులో కొడుకేంవిటిలే" అని పొమ్మన్నాను. అది జరిగి రెండేళ్ళయింది. ఆ కోయవాడు చెప్పింది ఇలా నిజమయ్యిందా? ఈ కాశీగాడు కొడుకు రూపంలో ప్రత్యక్షం అవుతాడని కలలో కూడా అనుకోలేదే.

వారం రోజుల్లో పిల్లలకి మోజు దిగిపోయింది. అందరి కుక్కల్లాగ కాశీ చెప్పినది ఏదీ చెయ్యడంలేదు. నోటికి ఏది దొరికితే అది కొరకడం, ఇల్లంతా పాడు చెయ్యడం మామూలే. ముఖ్యంగా అనుక్షణం నన్ను వదలకుండా కాళ్ళలో పడి కదలనీకుండా చేస్తున్నాడు. భగవంతుడా ఏది దారి అని ఆలోచిస్తూండగా, ఇంతలో మావారు మరో కొత్త వార్త తెచ్చారు. "మన కాశీని బడిలో వెయ్యాలి" అని

"ఏమిటీ, నిజంవే!'

"dog obedience schools" అని ఉంటాయిట. అందులో కాశీని చేర్చి వాడితో పాటూ మనం కూడా వెళ్తే అక్కడ వాడిని క్రమశిక్షణలో ఎలా పెట్టాలో నేర్పుతారట" శ్రీవారి ఉవాచ.

ఇహ ఆలస్యం ఎందుకని వాడి అక్షరాభ్యాసానికి అందరం వెళ్ళి అక్కడ పడ్డాం. దాంతో కాశీ మెల్లిగా కొన్ని అలవాట్లకి వచ్చాడు. కాని ఎంత వేసినా ప్రొద్దున్నే లేచి బయట పరుగెట్టాలన్న వాడి కోరిక మాత్రం మారలేదు. ఓ నాల్రోజులు పిల్లలు ఎగబడి వెళ్ళేరు. ఆ తర్వాత నామీద పడింది. తప్పుతుందా? వెళ్ళకపోతే వాడు ఇల్లంతా రంధి చేస్తాడు. "exercise" చెయ్యమనలేక నా మీద కక్షతో ఈ కాశీని తగిలించేరు మావారని ముందు గొణుక్కున్నా వాడి ధర్మమా అంటూ నాకు "morning walk" అలవాటయ్యింది. ముందర కాస్త ఇబ్బందిగా ఉన్నా ఆరోగ్యానికి మంచిదే అని సర్దుకున్నాను.

రోజులు గడిచిన కొద్దీ ఇంట్లో కాశీ స్థానం బాగా బలపరుచుకున్నాడు. అణకువగా ఉండి చెప్పిన మాట వింటున్నాడు. చిన్న తనపు చిలిపితనం తగ్గింది. పిల్లలమాటెలా ఉన్నా నాకు వాడితోటే లోకం అయిపోయింది. ఇలా ఉండగా ఓ రోజున వాడి పేరుకి ఓ శుభలేఖ వచ్చింది. ఆశ్చర్యంతో తెరిచి చూస్తే నిజంగా వాడికే. నాలుగిళ్ళవతల వాళ్ళు, వాళ్ళ కుక్క Sidney పుట్టినరోజుకి పార్టీ ఇస్తున్నారుట. కాశీని తీసుకుని రమ్మని ఆహ్వానం. ఇంతకన్నా విడ్డూరం ఎక్కడైనా ఉంటుందా? కాశీతో రోజుకో కొత్త వింత, సరికొత్త అనుభవం. సరే అదీ చూద్దాం అని వెళ్ళదలుచుకున్నాం. నిజానికి మాకు సరదాగా అనిపించింది. కాశీ వచ్చినప్పటినుంచీ కుక్కంటే భయం ఉన్నవాళ్ళు ఎవరూ మా ఇంటికి రావడం లేదు. పైగా వచ్చిన దగ్గరనుంచీ వాడినేదైనా అంటే నా మనస్సు చివుక్కుమనేది. అలాగే మమ్మల్ని ఎవరైనా పిలిచినా వాడిని ఇంట్లో వదిలివెళ్ళడం ఇష్టం లేక మేంవ్వూ వెళ్ళడమ్మానేసేం. ఈ పార్టీ విషయం ముందే తెలిసినట్టుగా సరిగ్గా రెండురోజులక్రితమే కాశీకి grooming appointment అయ్యింది. అక్కడికి వెళితే వాడికి ఆ groomers ఎంచక్కా వాడి జూలు, గోళ్ళు కత్తిరించి trim గా తయారుచేస్తారు. వాడికి అక్కడికి వెళ్ళడం అంటే బోలెడు

ఇష్టం. ఆడవాళ్ళు spa కి వెళ్ళి manicure, pedicure, massaging చేయించుకున్నట్టుగా హాయిగా వెళ్ళి అన్ని సేవలు చేయించుకుంటాడు. ఒక్కోమాటు వాడి పనే బాఁవుందనిపిస్తుంది.

మొత్తానికి పార్టీకి వాడిని తీసుకుని బయలుదేరేం. అక్కడ చూస్తే ఏం హడావిడి, ఏం కోలాహలం. సుమారు ఏడెనిమిది కుక్కలు ఉన్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే అవి అస్సలు మొరగకుండా అచ్చంగా మనం పార్టీలకి వెళ్తే ఎలా పలకరించుకుంటామో అలాగే మొహాలు తడుముకుంటూ, వాసనలు చూసుకుంటూ క్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నట్టుగా ఉన్నాయి. మా కాశీ ఆనందం చూస్తే నాకు ఎంతో ముచ్చట వేసింది. వాడికి మా ఇంట్లో కుక్క తోడు లేక ఒంటరిగా బాధపడుతున్నాడేమోనని జాలి కూడా వేసింది. ఇంతలో pup cakes అంటూ ఇంటి గృహిణి పెద్ద పళ్ళెంలో ఏవో పట్టుకొచ్చింది.

" మాకా? కుక్కలకా? "

" Of course for dogs. Today is Sidneys' birthday so the treat is for Sid's freinds" అందావిడ.

అంటే మనకేం పెట్టరా! అనుకుంటూ ఉండగానే వాళ్ళమ్మాయి" pleae come inside and have some food" అన్నాది.

కాశీని వదిలి వెళ్ళలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్న నాకు జవాబుగా "oh! he will be fine, you can leave him here," అంది.

వదలడమే తడవు కాశీ మిగతా కుక్కలతో ఆడుకుంటూ పెరట్లోకి వెళ్ళిపోయేడు. హమ్మయ్య! ఇదీ బాగానే ఉంది, అనుకుని లోపలికి వెళ్ళి కూచున్నాం. అంతా అయి బయలుదేరేవేళ కాశీ ఇంటివైపుకి రానని మొరాయించేడు. వాడిని బయలుదేరదీసి, ఇంటికి రావడానికి బ్రహ్మ ప్రయత్నమే అయింది. ఇంటికి వచ్చేక అందరం వాళ్ళ పార్టీ గురించి కబుర్లు.

"Wasn't that a cool party for Rico" పెద్దమ్మాయి.

" Oh! Yeah! Especially since we got invited because of Tinku " చిన్నది.

ఇంతలో మావారు గర్వంగా " మన కాశీ వల్ల మనం పార్టీకి వెళ్ళి వచ్చేం బాగానే ఉంది. కాని నా చిన్నప్పుడు మా పెదనాన్నగారు కుక్కలేకుండానే కాలభైరవుడు, అతని వాహనం అయిన కుక్క పేరుతో పెద్ద పార్టీ ఇచ్చారు తెలుసా!"

"what do you mean daddy?"

"Why?"

"పూర్వం రోజుల్లో తీర్థయాత్రలకి కాశీ, గయ, ప్రయాగ వెళ్ళి తిరిగొచ్చేక ఊళ్ళో అందరినీ పిలిచి పెద్ద సంతర్పణ చేసేవారు. సంతర్పణ అంటే మన పార్టీలాంటిదే అనుకోండి. దాన్నే కాలభైరవ సమారాధన అంటారు. కాశీలో కాలభైరవుడికి ఒక గుడి కూడా ఉంది. కాశీకి వెళితే తప్పకుండా ఆ గుడి చూసి రావాలంటారు. కుక్క కాలభైరవుడి వాహనము. కుక్కని కూడా కాలభైరవుడు అని అంటారు. అందుకే ఇంటికి వచ్చేక, ఊళ్ళన్ని తిరిగి, చూసిన వింతలూ, విశేషాలూ అందరితో చెప్పి, తీసుకొచ్చిన ప్రసాదాలు పంచుకుంటే యాత్రా ఫలం దక్కుతుందంటారు. అందుకే కాలభైరవ సమారాధన తప్పకుండా చేస్తారు. అప్పట్లో కుక్కల్ని పెంచకపోయినా కాలభైరవుడి పేరు మీద అందరూ కలిసి భోజనాలు చేసేవారు. ఇవాళ మనకి కుక్క ఉండడం ములాన్ని మనం పార్టీకి వెళ్ళి భోజనం చేసి వచ్చేం. అంతే తేడా! చూసేరా కుక్కకి మన పురాణాల రోజుల్లో కూడా ఎంత ప్రాముఖ్యం ఉందో. మనం కుక్కని పెంచి బాగా చూసుకుంటే కాలభైరవుడిని పూజించినంత పుణ్యం అంటారు".





